సొలతులులేని 'ఉపాధి'

- పని ప్రాంతాల్లో కూలీలకు వసతులు నిల్
- జాడలేని గుడారాలు, మెడికల్ కిట్లు
- మండుటెండల్లో కూలీల అవస్థలు

బావుసాయిపేటలో ఎండలో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలు(ఫైల్)

ఉపాధిహామీ కూలీలు మండుటెండల్లో మగ్గుతున్నారు. పని ప్రాంతాల్లో నిల్వ నీడ లేక అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి గొంతు తడుపుకోవడానికి గుక్కెడునీరు కూడా దొరకని పరిస్థితి నెలకొన్నది. గంటల తరబడి ఎండలో పని చేస్తున్న వారికి కనీస సౌకర్యాలు కల్పించే నాథుడే కరువయ్యాడు. దీంతో తప్పని పరిస్థితులల్లో మండుటెండల్లోనే పనిచేయాల్సి వస్తుందని కూలీలు వాపోతున్నారు.

–కోనరావుపేట, మే 14

గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులందరికీ పని కల్పిస్తున్నది. పని చేస్తున్న చోట వసతులు లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో కూలీలు మండుటెండల్లోనే పనులు చేయాల్సి వస్తున్నది. ఈ క్రమంలో పనులు చేసి అలసిన కూలీలు సేద తీరడానికి టెంట్లు వేయాల్సి ఉన్నా వేయడం లేదు. ప్రథమ చికిత్స కిట్లు, తాగునీటి వసతులు కరువయ్యాయి. దీంతో కూలీలు ఇంటి వద్ద నుంచే తాగు నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. అలాగే పరికరాలకు డబ్బులు చెల్లించకపోవడంతోపాటు వేసవి భత్యం కూడా అమలు చేయడం లేదని కూలీలు వాపోతున్నారు.

జిల్లాలో 62,145 జాబ్‌కార్డులు

జిల్లాలో మొత్తం 32,145మందికి జాబ్ కార్డులున్నాయి. ఇందులో 97,341 మంది కూలీలు ఉండగా, 28,029మంది ఉపాధి హామీ పనికి వెళ్తున్నారు. వీరికి సగటును ₹222 వరకు కూలీ వస్తున్నది. నీటి వనరుల్లో పూడికతీత, పంటల కాలువలలో పేరుకుపోయిన మట్టిని తీయడం, కందకాల తవ్వకాలు, గుట్టల ప్రాంతాల్లో పనులు చేస్తున్నారు. పని ప్రదేశాల్లో నీడ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. దీంతో ఎండ తీవ్రతకు ఉదయం 11గంటల వరకే పనులు ముగిస్తున్నారు. గతంలో వేసవిలో అదనపు భత్యం మార్చిలో 20శాతం, ఏప్రిల్‌లో 25 శాతం, మేలో 30శాతం చెల్లించేవారు. ఇప్పుడు అలా చెల్లింపులు చేయడం లేదు.

ఇంటికాడ నుంచే నీళ్లు తెచ్చుకుంటున్నం..

ఉపాధిహామీ పనులకు పోతే గతంలో సర్కారోళ్లు సొలతులు కల్పించేవాళ్లు. కానీ ఇప్పుడు మందులు, మంచినీళ్లు ఇత్తలేరు. తాగేనీళ్లు ఇంటికాడ నుంచే బాటిళ్లలో తెచ్చుకుంటున్నం. ఎండలు బాగా కొడుతుండడంతో పొద్దుగాలనే వస్తున్నం. వెంట తెచ్చుకున్న సద్దిని చెట్ల కింద నీడకే తింటున్నం. పని కాడా సొలతులు కల్పించాలి.

– తాళ్లపల్లి దేవవ్వ, కూలీ, నిజామాబాద్ (కోనరావుపేట)

గుడారాలు వేయాలె..

రోజురోజుకూ ఎండలు బాగా మండుతున్నాయి. కొంత పనిచేసి అలసిపోయిన తర్వాత సేద తీరుదామనుకుంటే చెట్లు కూడా లేవాయె. గుడారాలు లేకపోవడంతో ఎండలోనే ఉండిపోవాల్సి వస్తున్నది. మంచినీటి వసతులు కూడా లేవు. పనిముట్లు తగిలి దెబ్బతాకితే మందులే లేవు. ప్రభుత్వం కూలీలకు వసతులను కల్పిస్తే బాగుంటది.

– కవ్వంపల్లి నర్సవ్వ, కూలీ, నిజామాబాద్(కోనరావుపేట)

చర్యలు తీసుకుంటాం...

ఉపాధిహామీ పనులు జరిగే చోట తాత్కాలికంగా గుడారాలు, తాగునీటి వసతి ఉండేలా చర్యలు తీసుకుంటాం. వేతనాలు వెనువెంటనే అందించేలా చూస్తున్నాం. వేసవి భత్యం, పరికరాలకు డబ్బులు చెల్లింపు, ప్రథమ చికిత్స కిట్లు తదితర సౌకర్యాలను ప్రభుత్వం నిలిపివేసింది. పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని కూలీలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం

– శశికళ, ఎంపీడీవో (కోనరావుపేట)

పలువురికి అదనపు బాధ్యతలు

వేములవాడ, మే 14: వేములవాడ రాజన్న ఆలయంలో పలువురు ఉద్యోగులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఈవో కృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. లడ్డు ప్రసాదం తయారీ విభాగంలోని పర్యవేక్షకుడు రాజశేఖర్ ఇటీవల పదవివిరమణ పొందగా, ఆయన స్థానంలో కార్యాలయ పర్యవేక్షకుడు అరుణ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అకౌంట్స్ విభాగం సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌కు ప్రసాదాల తయారీ పర్యవేక్షణ పూర్తి స్థాయి బాధ్యతలు కేటాయించారు. అలాగే ఆయన స్థానంలో అకౌంట్స్ విభాగానికి జూనియర్ అసిస్టెంట్ గౌతమ్‌ను బదిలీ చేశారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి

కళాశాలలో పూర్వ విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

వేములవాడ రూరల్, మే 14: అగ్రహారం డిగ్రీ కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ కోరారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం పూర్వ విద్యార్థులు రాధాకృష్ణమాచార్యులు, గడ్డం సత్యనారాయణరెడ్డి, వాసరవేని పరశురాములు, జయవర్ధన్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధితోపాటు అడ్మిషన్ పెంచడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కళాశాలలో ఏటా జరిగే బంగారు పథకాల ప్రదానోత్సవానికి పూర్వ విద్యార్థులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలలో చదివే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని, కళాశాలలో మౌలిక వసతులు బాగున్నాయన్నారు. కళాశాలలో చేరేందుకు దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాలలో ఉన్న సమస్యలు, వివిధ అంశాలపై చర్చించారు.

ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు

ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్న జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నర్సింహారెడ్డి

ఇల్లంతకుంట, మే 14: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగడానికి సహకారం అందించిన మండల ఓటర్లకు జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు చెప్పారు.

చెరువు పూడికతీత పనులు ప్రారంభం

చెరువులోని మట్టిని ఎత్తిపోస్తున్న ఉపాధిహామీ కూలీలు

రుద్రంగి, మే 14: మండల కేంద్రంలోని గోలెపులోద్ది చెరువులో రూ.10లక్షల ఉపాధి హామీ నిధులతో పూడికతీత పనులను మంగళవారం అధికారులు ప్రారంభించారు. చెరువులో నీరు నిలిచేందుకు వీలు లేకపోవడంతో రైతుల దరఖాస్తు చేసుకోగా, అధికారులు పూడికతీత పనులకు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు 120 మంది కూలీలతో చెరువు పూడికతీత తీసి మట్టిని రైతుల పొలాలకు తరలిస్తున్నామని సిబ్బంది తెలిపారు.

కిచెన్‌షెడ్‌పై లేచిన రేకులు

వేములవాడ రూరల్, మే 14: మన ఊరు–మన బడి ప్రణాళికలో భాగంగా హన్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులు, కిచెన్‌షెడ్ పనులకు రూ.10లక్షలు కేటాయించారు. ఇటీవల వీచిన ఈదురుగాలులతో కిచెన్‌షెడ్‌పై రేకులు లేచిపోయాయి. కిచెన్‌షెడ్ పనుల్లో నాణ్యత లోపించిందని, అందుకే రేకులు గాలికి ఎగిరి పోయాయని గ్రామస్తులు ఆరోపించారు. మరమ్మతులు త్వరగా చేప ట్టాలని, పాఠశాల ప్రారంభానికి ముందే పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253

NT-3277

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

ముస్తాబాద్: కొండాపూర్‌లోని చౌడాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, నాయకులు

ఎల్లారెడ్డిపేట: సింగారంలోని సయ్యద్ హజ్రత్ ఇమాంఅలీ దుర్వేషావలీ దర్గాలో చాదర్ కప్పుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అమ్మవార్ల దీవెనలుండాలి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- కొండాపూర్‌లో చౌడాలమ్మ ఆలయంలో పూజలు
- సింగారంలో ఉర్సు, గోరంటాలలో సిద్ధోగం వేడుకలకు హాజరు

గంభీరావుపేట: ఎల్లమ్మ సిద్ధోగం వేడుకల్లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్, మే 14: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ మంగళవారం సిరిసిల్ల నియోజవకర్గంలో పర్యటించారు. తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌పై సరళిపై కార్యకర్తలతో చర్చించారు. అనంతరం ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలోని సయ్యద్‌హజ్రత్ ఇమామ్‌ఆలీ దుర్వేషావలీ దర్గాను సందర్శించారు. ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో చౌడాలమ్మను దర్శించుకున్నారు. తర్వాత గంభీరావుపేట మండలం గోరంటాలలో ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలకు హాజరయ్యారు. అమ్మవార్ల ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి.. పాడి పంటలు సమృద్ధిగా పండి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఎల్లమ్మ తల్లి ఆశీస్సులుండాలె..

ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆకాంక్షించారు. గంభీరావుపేట మండలం గోరంటాల ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలకు కేటీఆర్ హాజరై, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కట్నకానుకలు సమర్పించి మాట్లాడారు. గౌడ సభ్యుల కులదైవం ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం, సిద్ధోగం వేడుకలను వైభవంగా నిర్వహించుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఇక్కడ నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ గొరినేని నారాయణరావు, ఎంపీటీసీ ఎర్రం అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ కొలుముల అంజమ్మ, నాయకులు కొమిరిశెట్టి లక్ష్మణ్, వంగ సురేందర్‌రెడ్డి, కొలుముల బాల్‌రెడ్డి, భాషణవేని సురేందర్, జంగంపల్లి శేఖర్‌గౌడ్, గౌడ సంఘం సభ్యులు కోటగిరి బాబు, యాదగిరిగౌడ్, తదితరులు ఉన్నారు.

కల్యాణోత్సవానికి రండి

గంభీరావుపేటలో ఈ నెల 26న నిర్వహించనున్న ఎల్లమ్మ కల్యాణోత్సం, సిద్ధోగం వేడుకలకు రావాలని కోరుతూ గౌడ సంఘం సభ్యులు మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందించారు. ఇక్కడ గౌడ సంఘం సభ్యులు వెంకటస్వామిగౌడ్, రాజాగౌడ్, వెంకటస్వామిగౌడ్, యాదగిరిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజుగౌడ్, అక్షయ్‌గౌడ్ ఉన్నారు.

ఉర్సు ఉత్సవాలకు హాజరైన రామన్న

ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలోని సయ్యద్ హజ్రత్ ఇమాంఅలీ దుర్వేషావలీ దర్గాలో జరుగుతున్న ఉత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. దర్గాను సందర్శించి ఉర్సు ఉత్సవ నిర్వాహకుడు అజీజ్‌తో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గాపై చాదర్ కప్పి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ పట్టణా ధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనా రాయణ, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, బీఆర్ ఎస్ మండలాధ్యక్షులు బొంపెల్లి సురేంద ర్‌రావు, గజభీంకార్ రాజన్న, నాయకులు చీటి నర్సింగరావు, బొల్లి రామ్మోహన్, ఎండీ సత్తార్, కోడి అంతయ్య, అగ్గి రాములు, వాసరవేని దేవరాజు, నర్సాగౌడ్, నాగరాజు ఉన్నారు.

గంభీరావుపేట: సిద్ధోగ వేడుకలకు రావాలని ఆహ్వానిస్తున్న గౌడ సంఘం సభ్యులు

ముస్తాబాద్: కొండాపూర్‌లో గ్రామస్తులతో కేటీఆర్

ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న రామన్న

పోరాడి ఓడిన శ్రీచరణ్

- గత ఫిబ్రవరిలో బైక్ అదుపు తప్పి తలకు గాయాలు
- మూడు నెలలుగా చికిత్స
- పరిస్థితి విషమించి మృతి
- ₹కోటి ఖర్చు పెట్టినా దక్కని కొడుకు ప్రాణం
- తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు
- వేములవాడలో విషాదం

శ్రీ చరణ్ (ఫైల్)

వేములవాడ, మే 14: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎదిగిన కొడుకును కాపాడుకునేందుకు ఆ నిరుపేద కుటుంబం తల్లడిల్లింది. చేసేది చిన్నాచితక వ్యాపారమే అయినా తనయుడిపై ప్రేమతో శక్తికి మించి అప్పులుచేసి ఆఖరి దాకా పోరాటం చేసింది. ఒకటికాదు రెండు కాదు శక్తికి ఏకంగా ₹కోటి ఖర్చు పెట్టి మూడు నెలల పాటు చికిత్స చేయించినా ప్రాణం దక్కకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతుండగా, ఈ ఘటన వేములవాడలో విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన పన్యాల రాజు–రాణి దంపతులు కొన్నేండ్లుగా వేములవాడ పట్టణంలోని సుబ్రహ్మణ్యంనగర్‌లో చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. వీరికి ఇద్దరు కొడుకులు. చిన్న కుమారుడు శ్రీ చరణ్ (18) బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. గత ఫిబ్రవరి 10న బైక్ సర్వీసింగ్ కోసం కరీంనగర్ షోరూమ్‌కు వెళ్లి తిరిగివస్తుండగా ఉజ్వలపార్కు సమీపంలో అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తరలించగా, అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ యశోదకు తరలించారు. దాదాపు మూడు నెలలుగా దవాఖానలోనే ఉన్న చరణ్‌కు వైద్యులు మూడుసార్లు తలకు శస్త్ర చికిత్సలు చేశారు. చికిత్స కోసం ₹కోటికి పైగా చెల్లించినా నయం కాలేదు. సోమవారం రాత్రి పరిస్థితి విషమించి శ్రీ చరణ్ మృతి చెందాడు. కొడుకు కోసం శక్తికి మించి అప్పు చేసినా.. కండ్ల ముందే కాలం చేయడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. శ్రీ చరణ్ అంత్యక్రియలు మంగళవారం పట్టణంలో జరిగాయి. కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కొయ్యకాలు కాల్చొద్దు

ఇల్లంతకుంట, మే 14: రైతులు వారి పంటపొలాల్లో వరి కొయ్యకాలును కాల్చొద్దని మండల వ్యవసాయశాఖ అధికారి సురేశ్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొయ్యకాలు కాల్చడం ద్వారా వచ్చే వేడితో భూమి తన సారాన్ని కోల్పోతుందన్నారు. ప్రకృతి సమతుల్యత దెబ్బతిని నత్రజని, భాస్వరం వంటి పోషకాలు తగ్గి మరల వేసే పంటలో దిగుబడి తగ్గుతుందన్నారు. వరి కొయ్యకాలును కలియదున్నడంతో సేంద్రియ కార్బన శాతం పెరిగి ఐదు నుంచి పది శాతం పంట దిగుబడి పెరుగుతుందన్నారు. వరి కొయ్యకాలు కాల్చడంతో పంటకు మేలు చేసే మిత్ర పురుగులు చనిపోతాయని తెలిపారు. కొయ్యకాలు కాల్చకుండా కలియ దున్నడంతో సేంద్రియ ఎరువుగా మారి నీటి నిల్వ శాతం పెరుగుతుందని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, మే 14 : 2024–25 విద్యా సంవత్సరానికి అత్యుత్తమ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ నతానియేల్ తెలిపారు. మార్చి 2024లో ఎస్సెస్సీలో 7జీపీఏ పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో, బెస్ట్ అవైలబుల్ పథకం కింద చదివిన విద్యార్థులు కూడా అర్హులేనన్నారు. ఈనెల 30 లోగా ఎస్సెస్సీ ఉత్తీర్ణత మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాసు బుక్కు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బోనోఫైడ్ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులు జతపరిచి, http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు సమయంలో మూడు ప్రాధాన్యత కళాశాలలు మాత్రమే ఎంపిక చేసుకోవాలని, ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ పాస్ విధానంలో విద్యార్థుల ఎంపిక పూర్తి చేసి, కళాశాలలు కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు.

స్ట్రాంగ్‌రూములకు చేరిన ఈవీఎంలు

స్ట్రాంగ్‌రూముల ఎదుట భద్రతను పరిశీలిస్తున్న డీఈవో, అధికారులు

కలెక్టరేట్, మే 14 : ఓటర్ల తీర్పును తమలో నిక్షిప్తం చేసుకున్న ఈవీఎంలు జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూములకు చేరాయి. పోలింగ్ ముగిసిన అనంతరం వాటిని పటిష్టమైన భద్రత మధ్య ఓట్ల లెక్కింపు కేంద్రం ఎస్సారార్ కళాశాలలోని స్ట్రాంగ్ రూములకు తరలించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో వినియోగించిన ఈవీఎంలను సోమవారం అర్ధరాత్రి వరకు చేర్చారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పర్యవేక్షణలో మంగళవారం ఉదయం స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచారు. ఈప్రకియను డీఈవోతో పాటు పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్‌కుమార్ కూడా పర్యవేక్షించారు. ఈవీఎంల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను ఆయా సెగ్మెంట్ల వారీగా తరలించారు. అనంతరం సిబ్బంది స్ట్రాంగ్‌రూములకు తాళాలు వేసి, సీల్ చేశారు. ఈసందర్భంగా డీఈవో పమేలా సత్పతి మాట్లాడుతూ, ఈవీఎంల స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను ముగించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు మహేశ్వర్, రమేశ్‌బాబు, రామ్మూర్తి, ఏసీపీలు సతీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్యాట్ పట్టిన కొండూరి

- చిన్నారులతో కలిసి క్రికెట్ ఆడిన నాఫ్స్‌కాబ్ చైర్మన్

గజసింగవరంలో క్రికెట్ ఆడుతున్న కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, మే 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దాదాపు నెల రోజులపాటు నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తీరిక లేకుండా గడిపారు. పార్టీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. అయితే సోమవారం పోలింగ్ పూర్తి కావడంతో మంగళవారం సాయంత్రం గజసింగవరంలో బ్యాట్ పట్టి.. కాసేపు క్రికెట్ ఆడి చిన్నారుల్లో ఉత్సాహం నింపారు.

17 నుంచి క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

కమాన్‌చౌరస్తా, మే 14 : కరీంనగర్ జిల్లా కేంద్రంలో మే 17, 18, 19 తేదీల్లో సీఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో సెయింట్ మార్క్ చర్చి గ్రౌండ్ లో క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ డాక్టర్ కే రూబెన్ మార్క్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వమత శాంతి కోసం ఉజ్జీవ మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభల్లో అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ కలిగిన జెన్నీ క్రిస్టాఫర్ హాజరై మాట్లాడుతారని తెలిపారు. అనంతరం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్ కొమ్మాలు, డాక్టర్ ఎస్ జాన్, ఆర్ ప్రసాద్, బీ ప్రసాద్, ఏ మధు మోహన్, పింటు, రోజి, రెనాల్డ్, తిమోతి, క్రిస్టాఫర్, ఇండిపెండెంట్ పాస్టర్స్, సంఘాల పెద్దలు, ఇవాంజిలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.